వైశాఖ పూజలకు సర్వం సిద్ధం



దర్శనాలకు వెళ్లే ఈశాన్య గేటు మార్గం

- అరసవల్లి ఆదిత్యాలయంలో నేడు తొలి వైశాఖ ఆదివారం పూజలు
- ఈశాన్య గేటు నుంచే అన్ని దర్శనాలు
- పుష్కరిణిలో నీరు లేకపోవడంతో ప్రత్యేకంగా కుళాయిల ఏర్పాటు



స్నానాల కోసం సిద్ధం చేసిన కుళాయిలు

అరసవల్లి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం తొలి వైశాఖ ఆదివారం పూజలకు సిద్ధమైంది. భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉండటంతో ఎక్కడా ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ముఖ్యంగా ఎండ నుంచి రక్షణగా ఉండేలా టెంట్లు, మంచినీటి సౌకర్యాలు చేపట్టారు. రూ.500 విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం రూ.100 టికెట్లను సంబంధిత క్యూలైన్లలోనే విక్రయించేలా ఏర్పాట్లు చేశారు. అంతరాలయంలో కూడా ప్రతి భక్తుడు మొక్కులు చెల్లించుకునేలా, ప్రత్యేక ప్రసాదాలు సమర్పించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే ఆర్జిత పూజలకు, సేవలకు మాత్రం అనుమతి ఇవ్వడం లేదు. భద్రతా చర్యల్లో భాగంగా ఆలయంలోనికి వెళ్లే భక్తులు సెల్‌ఫోన్లు, బ్యాగేజీలను వెంట తీసుకువెళ్లకుండా సెక్యూరిటీ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

ఈశాన్యం గేటు నుంచే..

భక్తుల రాకపోకల్లో వస్తున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక పర్వదినాలతో పాటు ఆదివారాల్లో అన్ని దర్శనాలకు ఆలయ ఈశాన్య గేటు నుంచే దర్శనానికి వచ్చేలా ఏర్పాట్లు చేశారు. గ్రామదేవత అసిరితల్లి అమ్మవారి ఆలయం పక్క నుంచి ఉన్న ఈమార్గం ద్వారా దర్శనాలకు వచ్చేలా టెంట్లు వేయించారు. తిరిగివెళ్లేందుకు కూడా ఇదే మార్గం సిద్ధం చేశారు. వీఐపీలు మాత్రం సింహద్వారం నుంచి రాకపోకలు చేయాల్సి ఉంటుంది. వాహనాల పార్కింగ్‌కు సింహద్వారం దగ్గర నాలుగు పాయింట్లను కేటాయించారు. వీటితో పాటు ప్రైవేటు పార్కింగ్ పాయింట్లు అందుబాటులో ఉన్నాయి. ఎటువంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా వన్‌టౌన్ ఎస్సై బలివాడ గణేష్ చర్యలు చేపడుతున్నారు.

పుష్కరిణి బదులుగా కుళాయిలు..

వైశాఖమాసంలో తలనీలాలు సమర్పించుకుని ఇంద్రపుష్కరిణిలో భక్తులు స్నానాలు చేసి మొక్కులు చెల్లించుకోవడం సంప్రదాయంగా వస్తోంది. అయితే ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించారు. ఈ నేపథ్యంలో భక్తుల స్నానాలకు ఇబ్బందులు లేకుండా ఇంద్రపుష్కరిణి వసతి గదుల వెనుక భాగంగా సుమారు 60 కుళాయిలు(ట్యాపు)ను ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లు కూడా సిద్ధం చేశారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టినట్లు ఆలయ ఈఓ వి.హరి సూర్యప్రకాష్ 'సాక్షి'కి వివరించారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



రణస్థలం: ప్రార్థన చేస్తున్న ముస్లింలు

శ్రీకాకుళం కల్చరల్: జిల్లాలోని ముస్లిం సోదరులు రంజాన్ పండగ సందర్భంగా ఈదుల్ ఫితర్ నమాజులు శనివారం నిర్వహించారు. అనంతరం ఒకరి నొకరు ఆలింగన చేసుకుని ఈద్ ముబారక్ తెలియజేసుకున్నారు. ఈ సందర్భంగా పేదలకు దానధర్మాలు నిర్వహించారు. నెలరోజుల పాటు ఉపవాసాలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో అల్లాను ప్రార్థిస్తూ కఠిన నియమాలతో ఉన్నారు. తమ ఉపవాసాలను వదిలి ఆనందోత్సాహాలతో పండగను నిర్వహించుకున్నారు.

జామియా మసీదులో

పట్టణంలో చారిత్మాకమైన అతిపెద్ద పురాతన జామియా మసీదులో అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొని రంజాన్‌ను నిర్వహించారు. మతపెద్దల ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు చేపట్టారు. ప్రవక్త మాటలు ఆచరణీయం కావాలని కోరారు. సమైక్యంగా మెలగాలని ప్రవక్త బోధించారన్నారు. పట్టణంలోని చంపా, నూరానీ, చందా, మచ్చసీటీ, మదినా, మీనా మసీదుల ప్రతినిధులు, కమిటీ సభ్యుల పాల్గొన్నారు.

టౌన్‌హాల్‌లో ప్రార్థనలు

రంజాన్ పండగను పట్టణంలోని టౌన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కళింగ రోడ్డులో ఉన్న అహెల్ అతీల్ ఫిరదౌసీ మసీదుకు చెందిన ముస్లింలు పార్ధనల్లో పాల్గొన్నారు. ప్రసంగాన్ని అనీసుర్ రహెమాన్ నిర్వహించారు.

రణస్థలం: రంజాన్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని జామియా మసీద్ ఈద్గా ఆవరణలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అమీర్ సాహెబ్ (సలీం భాయ్) రంజాన్ ప్రాధాన్యతను వివరించారు. పవిత్ర రంజాన్ శాంతి సమానత్వానికి ప్రతీక అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి ఫకృద్దీన్ సాహెబ్, ముతవల్లి అబ్దుల్ రహమాన్, సాహెబ్ మస్తాన్, పద్ద మస్తాన్, తాజ్, బాషా సాహెబ్, జానీ మాస్టర్, రఫీ, సుభాని పాల్గొన్నారు.

బియ్యం పంపిణీ

రణస్థలం: మండల కేంద్రంలోని జామియా మసీద్‌లోని ముస్లింలకు వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పైడి శ్రీనివాసరావు బియ్యాన్ని అందజేశారు. రంజాన్ శుభాకాంక్షలను తెలియజేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్ద సలీం భాయ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పల్లి లక్ష్మణరావు, పిసిని పెంటంనాయుడు ఉన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: టౌన్‌హాల్ నుంచి ప్రార్థనల అనంతరం వస్తున్న ముస్లింలు



రణస్థలం: ముస్లింలకు బియ్యం పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు

ఇంటింటా ఆనందం



లావేరు: వెంకటాపురంలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నాయకులు, సచివాలయ కన్వీనర్లు

జగనన్నే మన భవిష్యత్తు.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉప్పెనలా సాగుతోంది. కార్యక్రమం నిర్వహణకు వెళ్తున్న సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లకు సంక్షేమ పథకాల లబ్ధిదారుల నుంచి ఇంటింటా అపూర్వ స్వాగతం లభిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధి పొందినవారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. శనివారం పలు గ్రామాల్లో కార్యక్రమం ఉత్సాహంగా సాగింది.



ఎచ్చెర్ల క్యాంపస్: సంతసీతారాంపురంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నాయకులు



జి.సిగడాం: దవళపేటలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కన్వీనర్ పేడాడ శ్రీరామమూర్తి



ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్‌లో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కషాయాలతో తెగుళ్ల నివారణ

ఎచ్చెర్ల క్యాంపస్: పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా కషాయాలు వినియోగించడం ద్వారా పంటలను ఆశించే తెగుళ్లను నివారించుకోవచ్చునని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు సిబ్బంది అరుణ అన్నారు. కషాలయాల తయారీపై ముద్దాడ గ్రామంలో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వావిలాల ఆకు కషాయం తెగుళ్ల నియంత్రణలో కీలకంగా చెప్పారు. పది కిలోల వావిలాల ఆకు 15 లీటర్ల ఆవు మూత్రంలో మరిగించి కషాయాన్ని తాయారు చేయాలని అవగాహన కల్పించారు. సిబ్బంది ధనలక్ష్మి, అప్పలనర్సయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

శ్రీకాకుళం: జిల్లా కలెక్టరేట్ ముందు 2008 డీఎస్సీ‌లో ఎంటీఎస్ ఉపాధ్యాయుల శనివారం నిరసన వ్యక్తం చేశారు. 12 నెలల జీతం కోసం జగనన్నకు చెప్పుకుందాం అని బ్యానర్‌ను ప్రదర్శించారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల కాంట్రాక్టు, రెసిడెన్షియల్ టీచర్లు మాదిరిగా తమకు కూడా 12 నెలల జీతం వర్తింపజేయాలన్నారు. ప్రస్తుతం తమకు 10 నెలలకు సబంధించిన జీతం మాత్రమే ఇస్తున్నారు. జిల్లా ఎంటీఎస్ టీచర్లు మహేష్‌కుమార్, పద్మావతి మల్లికార్జున్, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలను మరింతగా విస్తరించాలి



డీఈఓ తిరుమల చైతన్యకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పీఈటీ సంఘ నాయకులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో అన్ని పాఠశాలలకు క్రీడలను విస్తరించాలని, విద్యార్థుల శారీరక దారుఢ్యానికి బాటలు వేయాలని డీఈఓ ఎస్. తిరుమల చైతన్య ఆకాంక్షించారు. డీఈఓగా బాధ్యతలు స్వీకరించిన తిరుమల చైతన్యను శనివారం జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు మొజ్జాడ వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి నేతృత్వంలో సభ్యులు మర్యాదపూర్వంకగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. పీడీ, పీఈటీలంతా మరింత సమన్వయంతో పనిచేసి మంచి ఫలితాలను రాబట్టాలని డీఈఓ సూచించారు. పాఠశాల క్రీడల్లో ఈ ఏడాది అద్భుత ఫలితాలు, సాధించిన పీడీలు, పీఈటీలను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బి.వి.రమణ, 2వ జోన్ అధ్యక్షుడు సింహాద్రినాయుడు, ఎం.ఆనంద్‌కిరణ్, హరీష్‌రాయుడు, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ సస్పెన్షన్లను అడ్డుకోవాలి



మంత్రి బొత్స సత్యనారాయణకు ఫిర్యాదు అందజేస్తున్న శ్రీనివాసులనాయుడు

శ్రీకాకుళం న్యూకాలనీ: మన్యం పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల్లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ గత రెండు రోజులుగా జరిపిన అక్రమ సస్పెన్సులు వెంటనే ఆపాలని రాష్ట్ర విద్యాశాఖామంత్రి బొత్స సత్యన్నారాయణను మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు కోరారు. ఈ మేరకు మంత్రి బొత్సకు శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్‌ను సైతం గాదె కలిశారు. ప్రభుత్వం సంకల్పించిన విద్యాభివృద్ధి కోసం అధికారులు, ఉపాధ్యాయులు ఎంతగానో కృషిచేస్తున్నారని, వారికి అన్యాయం చేయవద్దని మంత్రి బొత్సకు విన్నవించారు. రాత్రివేళల్లో తనిఖీలు చేయడం గతంలో ఎన్నడూ లేదని, ఇలా చేస్తే విద్యామనుగడ కష్టమవుతుందన్నారు.

హద్దుల గుర్తింపు

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని కళ్లేపల్లిలో జగనన్న శాశ్వత భూ హక్కు పథకంలో భాగంగా శనివారం కొన్ని ప్రాంతాల్లో హద్దు రాళ్లు వేయడం జరిగింది. వైస్సార్‌సీపీ జిల్లా పంచాయతీ విభాగం అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మూకళ్ల తాతబాబు, పార్టీ నాయకులు ఎచ్చెర్ల శ్రీధర్, ఎంపీటీసీ బాన కిశోర్ పాల్గొన్నారు.



హద్దు రాళ్లు వేస్తున్న దృశ్యం

చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న జేకేఎల్ సుజాత

ఎచ్చెర్ల క్యాంపస్: చట్టాల పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జేకేఎల్ సుజాత అన్నారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల యూనిట్ –7 ఆధ్వర్యంలో ఎచ్చెర్లలో నాలుగో రోజు కార్యక్రమాల్లో భాగంగా మహిళల చట్టాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దిశ, మానవ అక్రమ రవాణా చట్టాలపై ప్రతి మహిళ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

అరిణాం అక్కివలసలో ఎన్ఎస్ఎస్ శిబిరం ప్రారంభం

బీఆర్ఏయూ జాతీయ సేవాపథకం యూనిట్ రెండు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక సేవా శిబిరాన్ని ప్రారంభించారు. వారం రోజులు నిర్వహించే శిబిరంలో భాగంగా తొలిరోజు గ్రామీణ ప్రగతిపై సర్వే నిర్వహించారు. పీవో డి.తాతారావు పర్యవేక్షించారు.

విద్యాశాఖ కార్యదర్శి చర్యలు సరికాదు

శ్రీకాకుళం న్యూకాలనీ: గతంలో లేని విధంగా రాత్రుళ్లు తనిఖీలకు వచ్చి ఉపాధ్యాయులను, విద్యాశాఖ అధికారులను సస్పెన్షన్ చేస్తున్న విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ తీరు ఎంతమాత్రం సరికాదని ఐక్య ఉపాధ్యాయ వేదిక ఫ్యాప్టో నాయకులు శనివారం ఒక ప్రకటనలో ఖండించారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలతో కలిపి ఉద్యమాన్ని చేపట్టి ఎదుర్కొంటామన్నారు. ప్రకటన విడుదల చేసినవారిలో ఫ్యాప్టో నాయకులు మజ్జి మదన్ మోహన్, కొమ్ము అప్పలరాజు, పొందూరు అప్పారావు, ఎస్వీ రమణమూర్తి, టెంక చలపతి రావు, పేకేటి రామారావు ఉన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం అర్బన్: 'రిజర్వేషన్‌లు అంతం చేసే కుట్ర' పేరుతో ప్రచురించిన పుస్తకాన్ని శ్రీకాకుళంలో ఎన్‌జీఓ కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించనున్నట్లు సిక్కోలు బుక్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు దుప్పల రవికుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్‌లు కల్పిస్తూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టంపై చర్చిస్తూ.. కస్తూరి విజయం ప్రచురణ సంస్థ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల అంతం చేసే కుట్ర పేరుతో పుస్తకాన్ని ప్రచురించిందన్నారు. ఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు హనుమంతు సాయిరాం అధ్యక్షతన జరగనున్న ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి తెలుగు అనువాదకులు సిద్ధార్థ్ సుభాష్ చంద్రబోస్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి రుంకు అప్పారావు, బీసీ సంఘ నేత పి.చంద్రపతిరావు, సంపాదకులు పి.ఎస్.నాగరాజు పాల్గొంటారన్నారు.

పుడమి పరిరక్షణ అందరి బాధ్యత



కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: వాతావరణ కాలుష్యంతో భూతాపం పెరిగి మానవ మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతుందని, పుడమి తల్లిని పరిరక్షించుకోవాలిసిన బాధ్యత మనందరిపై ఉందని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం ఇంటర్నేషనల్ అధ్యక్షుడు హారికాప్రసాద్, వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు అన్నారు. నగరంలోని సానా వీధిలో ఉన్న హారిక ప్రసాద్ కార్యాలయ ఆవరణలో శనివారం ధరిత్రి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. వాతావరణ మార్పుల ప్రభావంతో భూతాపం పెరిగి ప్రకృతి వైపరీత్యాలు కలుగుతున్నాయన్నారు. మొక్కలు పెంచడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మితిమీరిన ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రకృతి దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. తీరప్రాంతం, చిత్తడి, మడ అడవుల పరిరక్షణ వంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారంలో ఒక రోజు సైకిల్‌ను వినియోగించాలని కోరారు. నీరు, విద్యుత్, ఇంధనం వంటి విలువైన వనరుల వినియోగంలో పొదుపు అలవర్చుకోవాలన్నారు. ప్రభుత్వాలు సహజ వనరుల వినియోగం కేటాయింపుల్లో చిత్తశుద్ధితో వ్యవహరించాలని చెప్పారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, జి.సత్యనారాయణ, మారుతీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన మురళి, స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి.దేవి ప్రసాద్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు నటుకుల మోహన్, బడానా దేవభూషణరావు, వావిలపల్లి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా బాబా ఆలయ వార్షికోత్సవం



బాబా చిత్రపటాన్ని ఊరేగిస్తున్న భక్తులు

జి.సిగడాం: చెట్టుపొదిలాం గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయ మొదటి వార్షికోత్సవం శనివారం వైభవంగా ప్రారంభమైంది. పూజ్య గురువులు అమ్ముల సాంబశివరావు ఆశీస్సులతో కమిటీ సభ్యులు భూపతి అర్జున్‌కుమార్, రమాదేవి పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ కాంతులతో అలంకరించారు. బాబా చిత్రపటాన్ని గ్రామంలో ఊరేగించారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో సత్యవ్రతాలు నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు.

మణికంఠకు అభినందనలు



మణికంఠను అభినందిస్తున్న సాయికుమార్ తదితరులు

రణస్థలం: చిల్లపేటరాజాం గ్రామానికి చెందిన కొంతల మణికంఠ ఇటీవల జాతీయ స్థాయిలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ప్రథమంగా నిలిచారు. దీంతో ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ శనివారం చిల్లపేటరాజాంలోని మణికంఠ ఇంటికి వెళ్లి దుశ్శాలువతో సత్కరించి అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, నాయకులు చిల్ల వెంకటరెడ్డి, మహంతి పెదరామినాయుడు, కంబపు నర్సింహులు రెడ్డి, కొణతాల లక్ష్మణరెడ్డి, కిల్లారి సూర్యనారాయణ, చిల్ల గాంధీ, శీరపు అప్పారావు, కంబపు తాతారావు, మహంతి సత్యనారాయణ, కృష్ణ, లక్ష్మంనాయుడు, గోవింద, లక్ష్మణరావు, రమణ, అప్పన్న ఉన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకావిష్కరణ



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక గుడివీధిలోని ప్రభాకర శ్రీనివాసశర్మ పీఠంలో పార్నంది ఫణి శ్రీనివాసశర్మ రచించిన శ్రీచక్రార్చన, శ్రీచక్ర ఆవారణార్చన విధి పుస్తకాలను శనివారం ఆవిష్కరించారు. పన్నాల నర్సింహమూర్తి, ఎస్.ప్రసాదరావు, పి.కోటిబాబు, టి.విగ్రమశర్మ, కామేశ్వరరావు, అన్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిది గేదెలు మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: జాతీయ రహదారిపై విజయాదిత్య పార్కు నుంచి తమ్మినాయుడుపేట మధ్య శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది గేదెలు మృతి చెందాయి. రోడ్డుపైకి గేదెలు రావడంతో చీకటిలో గమనించక వాహనాలు ఢీకొట్టి ఉంటాయని పోలీసులు, జాతీయ రహదారుల సంస్థ సిబ్బంది భావిస్తున్నారు. రోడ్డు మధ్య గేదెలు మృతి చెందడంతో వాహనచోదకులు ఇబ్బంది పడ్డారు. ఇవి హయాతినగరానికి చెందిన వారివిగా గుర్తించారు. రోడ్డుపైకి రాత్రిపూట గేదెలు ఎలా వచ్చాయన్న అంశంపై పోలీసులు ఆరాతీస్తున్నారు.

నేడు సొండి కుల సంఘ సమావేశం

రణస్థలం: మండల కేంద్రంలోని పిన్నింటిపేట రోడ్డులో ఉన్న అపార్టుమెంట్ ఆవరణలో సొండికుల సంక్షేమ సేవా సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘ మండల అధ్యక్షుడు మొగలపురి మల్లికార్జునరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. జిల్లా ప్రముఖులు హాజరు కానున్న సమావేశానికి రణస్థలం, లావేరు మండలాల్లోని సొండి కులస్తులు పాల్గొనాలని కోరారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

లావేరు: మురపాక గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద చలివేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో దీన్ని ఏర్పాటు చేశారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.